క్లుప్తంగా

ఘనంగా ఫాదర్స్ డే



తండ్రికి స్వీట్లు తినిపిస్తున్న కూతుళ్లు

మొయినాబాద్‌రూరల్: ప్రపంచానికి మనల్ని చూపేది అమ్మ.. అయితే ప్రపంచాన్నే మనకు చూపేది నాన్న.. ఈ రోజు ఫాదర్స్ డే జరుపుకోవడం మనకు గర్వకారణమని యోగా సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస్, మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారిలు అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో పాదర్స్ డేను కుటుంబ సభ్యులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో యోగా కేంద్రంలో డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తన కూతుళ్లు, వివిధ గ్రామాలకు చెందిన సభ్యులతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. అమ్డాపూర్‌లో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫాదర్స్‌డే ఉత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో యోగా సెంటర్ చైర్మన్ భారతీ, సభ్యులు లక్ష్మీప్రసన్న, వివిధ గ్రామాల నాయకులు వెంకట్‌రెడ్డి, మణికంఠ, వీరచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న శివప్రసాద్, తదితరులు

చేవెళ్ల: ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆయన నివాసంలో ఆదివారం చేవెళ్ల మండల వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకుడు పి.హన్మంత్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానించి అమెరికాలో 18వ ఆట మహాసభలకు వెళ్లి అమెరికా పర్యటన ముగించుకొని వచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మండల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



వేడుకలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

మొయినాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించే దిశగా ముందడుగు వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజయం సాధించిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇండస్ట్రియలిస్టులు మధూకర్, దినాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దే సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాధవచారిల ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో శివారెడ్డి, తూర్పాటి కృష్ణ, ఆంగోత్ కృష్ణనాయక్, ఆంగోత్ రాజేశ్, దేవిజా, సాంటె నర్సింహ, కాట్రావత్ సోమనాథ్, కాట్రావత్ రమేశ్, ప్రకాశ్, సేవల, మునావత్ రాములు, శ్రీను, జరుపుల శ్రీను, తుల్జా, నేనావత్ గోపాల్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొందూరి మనోహర్, సిద్దు సురేందర్‌చారి, కాట్రావత్ కిషన్‌నాయక్, కడల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించేదెలా?



వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి(ఫైల్)



కుర్వగూడలో ఇళ్ల మధ్య ఉన్న స్థలంలో వాలీబాల్ ఆడుతున్న చిన్నారులు(ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు కరువు
- ఆసక్తి ఉన్నా ఆటలకు దూరంగా ఉంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అధికారులు, పాలకులు తరచూ పాఠశాలల్లో నిర్వహించే పలు సమావేశాల్లో ప్రసంగాలు చేస్తుంటారు. కాగా వాస్తవ పరిస్థితుల్లో మాత్రం మండలంలోని హైతాబాద్, మన్‌మర్రి, బాలికల, రేగడిదోస్వాడ, తదితర పాఠశాలల్లో సరైన క్రీడా మైదానాలు లేవు. షాబాద్ మండలంలో 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత, 45 ప్రాథమిక పాఠశాలలు, ఒక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో 6 వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు.

మైదానాలు లేక..

పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతీ ఉన్నత పాఠశాలలో పీఈటీ(వ్యాయామ)ఉపాధ్యాయుడిని నియమించింది. పలు పాఠశాలల్లో పీఈటీలు ఉన్నా పాఠశాలల్లో ఆటస్థలాలు లేని కారణంగా వారు విద్యార్థులకు క్రీడల్లో పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడం లేదు. అంతేకాకుండా పలు క్రీడలకు అవసరమయ్యే పరికరాలు కూడా అందుబాటులో లేని కారణంగా పీఈటీలు విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడలపై శిక్షణ ఇవ్వడం లేదు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు హైతాబాద్, మన్‌మర్రి, రేగడిదోస్వాడ ఉన్నత పాఠశాలల్లో మైదాన స్థలాలు ఉన్నా వీటిని చదును చేయించి వినియోగంలోకి తేవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. హైతాబాద్ ఉన్నత పాఠశాల ఆవరణలో మైదానం లేని కారణంగా విద్యార్థులు గ్రామ శివారులో ఖాళీ ప్రదేశంలో ఆడుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నా విద్యార్థుల ప్రయోజనార్థం వాటిని క్రీడా మైదానాలుగా ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంగా విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉన్నా సరైన సౌకర్యాలు లేని కారణంగా మౌనంగా ఉంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తప్పనిసరిగా క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మైదానాలు అవసరం



పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం క్రీడా మైదానాలు తప్పకుండా ఉండాలి. విశాలమైన ప్రదేశంలో శిక్షణ పొందితే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెరిగి వారు బాగా రాణిస్తారు. వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణకు అనువుగా ఉంటుంది.
– గంగిడి భూపాల్‌రెడ్డి, హైతాబాద్

ఇబ్బందులు ఎదురవుతున్నాయి



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేది పేద తరగతి పిల్లలు. వీరికి క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా మైదానాలు లేక సరైన శిక్షణ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి క్రీడల్లో విద్యార్థులకు ప్రోత్సహించడానికి ప్రతి పాఠశాలలో తప్పకుండా మైదానాలు ఏర్పాటు చేయాలి.
– రవీందర్‌గౌడ్, పీడీ, సర్దార్‌నగర్ పాఠశాల

ప్రతిపాదనలు పంపుతాం



మండలంలోని పలు పాఠశాలల్లో మైదానాలు ఉన్నా చదునుగా లేవు. మరికొన్ని పాఠశాలల్లో ఆసలు మైదానాలే లేవు. ఈ కారణంగా క్రీడలకు అంతరాయం కలుగుతుంది. ప్రతి పాఠశాలలో ఆటస్థలం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. – శంకర్‌రాథోడ్, ఎంఈఓ

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

షాద్‌నగర్ డీఎం ఉష



మాట్లాడుతున్న డీఎం ఉష

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడం ఎంతో సురక్షితమని డిపో మేనేజర్ ఉష అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ అమలు చేస్తున్న పథకాలపై కళాజాత బృందం సభ్యులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం ఉష మాట్లాడుతూ.. ఆర్టీసీలో అనుభవం కలిగిన డ్రైవర్లు ఉంటారని, ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా బస్సులను నడుపుతారని పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తుందన్నారు. అనంతరం కళాజాత బృందం సభ్యులను డీఎం సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, నాగులు, అర్జున్‌కుమార్, వెంకటేశ్, కళాజాత బృందం సభ్యులు గోపయ్య, సంపత్, శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీఎం ఉష అన్నారు. లక్షే లక్ష్యంలో భాగంగా ఆర్టీసీ ఎండీ.సజ్జనార్ ఆదేశాల మేరకు రెండురోజుల క్రితం ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల మేథస్సుకు పదును పెట్టేందుకు వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిని విద్యార్థుల తల్లితండ్రులకు ప్రశంస పత్రాలను అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



5కే వాక్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న గీతా భాస్కర్, వాణి

శంకర్‌పల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాల్లో నిలవాలని ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ తల్లి నటి గీతాభాస్కర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శారద నేరెళ్ల అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం మోకిలలోని పీజీ హిల్స్‌లో గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మోకిల శారీథాన్ సెకండ్ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గీతా భాస్కర్, శారద నేరెళ్ల, భవానీలు ముఖ్య అతిథులుగా హాజరై 5కే, 3కే వాక్‌లను జెండా ఊపి ప్రారంభించగా.. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు జుంబా డ్యాన్స్, యోగా, అదే విధంగా పలువురు ప్రకృతి సిద్ధంగా తాము తయారు చేసిన వస్తువులు, ఫుడ్స్‌లను స్టాళ్ల రూపంలో ఏర్పాటు చేయగా అతిథులు వాటిని కొనుక్కున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధికి తోడ్పాటును అందించి, వారి ఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వనిత చేయూత సంస్థ చైర్మన్ వాణిని వారు ప్రత్యేకంగా అభినందించారు. అన్ని పనులు దగ్గరుండి చూసుకునే మహిళలు తమ ఆరోగ్యానికి తగిన సమయం కేటాయించాలన్నారు. ప్రకృతి సిద్ధంగా ఉండే వస్తువులను వాడి, వాటిని మళ్లీ పునఃవినియోగం చేయాలని, ప్రకృతికి హాని కలిగించే వస్తువులను విడనాడాలన్నారు.

వందపడకల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి



అగ్ని ప్రమాదంపై వివరాలు తెలుసుకుంటున్న భీంభరత్, తదితరులు



అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

చేవెళ్ల: చేవెళ్ల నియోజకవ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. శనివారం రాత్రి ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఏర్పడిన ప్రమాదంపై వారు ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రంలో సమస్యను త్వరగా పరిష్కరించి సేవలను ప్రారంభించాలన్నారు. మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చేసుకోవాలని సూచించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా మార్చేందుకు వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఆయన వెంట టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సున్నపు వసంతం, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బి.ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు పాండు, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, నాయకులు మానిక్యం, శ్రీను తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి: ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో జరిగిన ప్రమాదంపై బీజేపీ చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రమణారెడ్డిలతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన వార్డును పరిశీలించి ఎలా జరిగిందని వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోనే ఉన్న డీసీహెచ్‌ఓ రాజుతో కలిసి మాట్లాడారు. డయాలసిస్ వార్డులో వెంటనే పునఃరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. తాము ఆసుపత్రికి సొంత నిధులతో జనరేటర్‌ను అందించామని, దీనిని ఉపయోగించి డయాలసిస్ వార్డు సమస్య తీరేవరకు వైద్యసేవలు కొనసాగించుకోవాలని సూచించారు. చేవెళ్ల ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వైద్యసేవలు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం

రాత్రి సంఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నామని డీసీహెచ్‌ఎస్ రాజు తెలిపారు. రాత్రికి రాత్రే ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆస్పత్రికి చేరుకున్నామని టెక్నీషన్‌లను పిలిపించి పరిశీలించినట్లు ఆయన చెప్పారు. విద్యుత్ వచ్చిపోతుండటంతో అధిక లోడ్ పడటంతో ఈ ప్రమాదానికి కారణమైందని టెక్నీషన్‌లు చెప్పారన్నారు. దీంతో ఆస్పత్రిలోని మొత్తం వార్డుల్లో విద్యుత్ వైర్లను చెక్ చేయించామని తెలిపారు. ప్రమాదం జరిగిన చోట పునఃరుద్ధరణ పనులు చేపట్టామని వెంటనే డయాలసిస్ కేంద్రంలో వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

నెరవేరిన బీటీరోడ్డు కల

- శ్రీరాంనగర్-అమ్డాపూర్ గ్రామాల మధ్య రోడ్డుకు రూ.6.90 కోట్లు మంజూరు
- రెండురోజులుగా కొనసాగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



శ్రీరాంనగర్-అమ్డాపూర్ గ్రామాల మధ్య కొంతమేరకు పూర్తయిన బీటీరోడ్డు



జోరుగా సాగుతున్న బీటీరోడ్డు పనులు

మొయినాబాద్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీటీరోడ్డు కల ఎట్టకేలకు నెరవేరింది. శ్రీరాంనగర్-అమ్డాపూర్ గ్రామాల మధ్య బీటీరోడ్డు నిర్మాణ పనులు రెండురోజులుగా జోరుగా సాగుతున్నాయి. మండల పరిధిలోని శ్రీరాంనగర్-అమ్డాపూర్ గ్రామాల మధ్య 4.5 కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు వేయాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు విన్నవించారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు మొదలు పెట్టలేదు. అప్పట్లో 12 అడుగుల వెడల్పుతో బీటీ నిర్మాణానికి మాత్రమే నిధులు మంజూరయ్యాయి. 22 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్డు వేయాలని స్థానికులు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం నిధులను రూ.6.90 కోట్లకు పెంచింది. ఈ నిధులతో పనులు మొదలుపెట్టారు. రెండునెలలుగా కంకర వేసి వదిలేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. రెండురోజుల నుంచి బీటీరోడ్డు వేయడం మొదలుపెట్టారు. శని, ఆదివారం బీటీ పనులు జోరుగా కొనసాగాయి. మరో ఒకటి, రెండు రోజుల్లో మొత్తం పనులు పూర్తికానున్నాయి.

స్థానికుల హర్షం..

శ్రీరాంనగర్-అమ్డాపూర్ గ్రామాల మధ్య బీటీ వేయడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పెరగడంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అటూ, ఇటూ వెళ్లడానికి దగ్గర దారి అవుతుంది. బీటీ రోడ్డు వేయడంతో తమ భూములకు సైతం విలువ పెరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: మండల పరిధిలోని హైతాబాద్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం హైతాబాద్‌లోని జీవీఆర్ గార్డెన్స్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, ఆంజనేయులును సన్మానించారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరూ పరిచయం చేసుకున్నారు. చిన్ననాటి మిత్రులు ఒకేచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెంటారెడ్డి, కృష్ణగౌడ్, ఆంజనేయులు, సంతోష్, రాఘవేందర్, సుమలత, మాధవి, మంజులు, సునీత, జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి

నందిగామ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడల్లో యువత పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, ఇలాంటి పోటీల్లో గెలుపు, ఓటమిలు సహజమేనని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడలో కొన్నిరోజులుగా సాక్షిత్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విన్నర్ టీమ్‌కు రూ.25వేల నగదుతో పాటు కప్‌ను అందజేశారు. అదే విధంగా రన్నర్‌గా నిలిచిన టీమ్‌కు రూ.15వేల నగదుతో పాటు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఉమారెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ప్రేమ్‌గౌడ్, ఎంపీటీసీ మాధవి, లక్ష్మి, గ్రామస్తులు రవీందర్, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.

టెక్నాలజీని పర్యావరణ హితానికి వినియోగించాలి



చైర్మన్ లింబాద్రికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి

మొయినాబాద్: సాంకేతిక రంగంలో టెక్నాలజీని పర్యావరణ హితానికి వినియోగించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పర్యావరణానికి నష్టం జరగకుండా టెక్నాలజీని వాడుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆ దిశగా తమ ఆలోచనలను మలుచుకోవాలన్నారు. ప్రతిభా, నైపుణ్యం ఉన్న విద్యార్థులకు సాంకేతిక రంగంలో చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. కేజీరెడ్డి కళాశాల క్యాంపస్ హరిత వనంలా ఉందని కితాబిచ్చారు. సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: అనారోగ్యాలకు గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మజీద్‌మామిడిపల్లికి చెందిన సుధాకర్ కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2లక్షల యాభై వేల చెక్కును ఎమ్మెల్యే ఆదివారం ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, నవీన్‌గౌడ్, సుదర్శన్, జంగయ్య, నర్సింహులు, నవీన్, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.